
సాక్షి తిరుపతి

గురువారం । 17 । జూలై । 2025

● పుష్పపల్లకీలో పురుషోత్తముడు



తిరుమల వేంకటేశ్వర స్వామి దేవేరులతో కలసి బుధవారం సాయంత్రం పుష్పపల్లకీలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం ఉదయం ఆణివార ఆస్థానం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన పల్లకిపై కొలువుదీర్చారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు. – తిరుమల

న్యూస్‌రీల్

స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు దక్కడం శుభపరిణామం



మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి తుడా: తిరునగరి వరుసగా నాలుగోసారి స్వచ్ఛసర్వేక్షన్ అవార్డు కైవసం చేసుకోవడం శుభపరిణామమని నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష ఆనందం వ్యక్తం చేశారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న విప్లవాత్మక సంస్కరణల ఫలితమే ఈ అవార్డు దక్కడానికి ప్రధాన కారణమన్నారు. స్వచ్ఛసర్వేక్షన్ లీగ్ సిటీస్ విభాగంలో తిరుపతికి ఈ అవార్డు దక్కిందన్నారు. ఇందుకోసం బుధవారం ఢిల్లీకి పయనమవుతున్నట్లు చెప్పారు. గురువారం ఢిల్లీ విద్యాభవన్ వేదికగా జరిగే ప్రత్యేక కార్యక్రమంలో అవార్డును అందుకోనున్నామని తెలిపారు. ఈ అవార్డుతో నగరపాలక సంస్థ యంత్రాంగం మరింత బాధ్యతగా పనిచేసి దేశంలోనే నంబర్ వన్ సిటీగా తిరుపతి నిలిచేలా కృషి చేయాలన్నారు.

రేపటితో ముగియనున్న వెబ్ ఆప్షన్లు

తిరుపతి సిటీ: ఏపీఈఏపీసెట్–2025కు సంబంధించి ఇంజినీరింగ్ వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగియనుంది. ఈనెల 13వ తేదీ నుంచి కొనసాగుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఇప్పటికే జిల్లాలో సుమారు 19 వేల మందికిపైగా వెబ్ ఆప్షన్ల ప్రక్రియను పూర్తి చేశారు. మరో రోజు మాత్రమే వెబ్‌ఆప్షన్లకు అవకాశం ఉండడంతో విద్యార్థులు అప్రమత్తం కావాలని అధికారులు సూచిస్తున్నారు. ఈనెల 19వ తేదీన ఒక రోజు మాత్రమే వెబ్ ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉండనుంది. 22 వతేదీన సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి కానుంది. అలాగే ఐసెట్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ఈనెల 21వ తేదీవరకు ఆప్షన్ల ఎంపికకు అవకాశం ఇచ్చిన అధికారులు, 22న వెబ్ ఆప్షన్ల మార్పు, 25న సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు.

గ్రామస్థాయిలో క్షయ నివారణకు కృషి



రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్ డాక్టర్ భవానీసింగ్ కుష్వా

తిరుపతి రూరల్ : గ్రామ స్థాయిలో క్షయ (టీబీ) నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాతీయ క్షయ నివారణ విభాగం డిప్యూటీ కమిషనర్ డాక్టర్ భవానీసింగ్ కుష్వా సూచించారు. తిరుపతి రూరల్ మండలం వెంకటపతినగర్ పంచాయతీలో బుధవారం జాతీయ క్షయ నివారణ కేంద్రం తరపున ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధితో బాధపడుతున్న వారు సకాలంలో వైద్య సేవలు తీసుకుంటే ప్రాణాలతో బయటపడవచ్చన్నారు. ముఖ్యంగా క్షయ కారణాలు, లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి సర్పంచ్ బాధ్యతగా తీసుకుని తరచూ అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా చేస్తున్నారని, సర్పంచ్ చిన్నియాదవ్, ధర్మారావు, గంగాధర్‌దాస్, డాక్టర్ ధీరజ్, డాక్టర్ శైలజ, డాక్టర్ ఉదయశ్రీ, ధనలక్ష్మి, అంజనాబాయి పాల్గొన్నారు.

కొనుగోడు పట్టేదెవరికి?

అరుగాలం శ్రమిస్తున్న రైతులకు అడుగడుగునా అన్యాయమే జరుగుతోంది. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి పంట సాగు చేసినా కష్టార్జితం దక్కడం లేదు. చివరకు పండిన పంటకు గిట్టుబాటు దక్కకపోగా.. అమ్మకమూ సమస్యగా మారుతోంది. పంట ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాల్సిన కూటమి సర్కారు కర్షకుడిని కనికరించడం లేదు. ఫలితంగా పుడమి పుత్రుడికి పుట్టెడు శోకం మిగులుతోంది.




నిమ్మ ధరలు పతనం

- చెట్లు నరికివేస్తున్న రైతులు
- ధరలు తగ్గడంతో సాగు కష్టంగా మారిందంటున్న రైతులు



పండ్లను గ్రేడింగ్ చేస్తున్న కూలీ



సైదాపురం ప్రాంతంలో నరికివేస్తున్న నిమ్మ తోటలు

తిరుపతి జిల్లాలో నిమ్మ సాగు విస్తీర్ణం
15 వేల హెక్టార్లు
ప్రతిరోజూ దిగుబడి సుమారు
400 టన్నులు
ప్రతిరోజూ గూడూరు మార్కెట్ నుంచి ఎగుమతి
308 టన్నులు

చిల్లకూరు: మొన్న వరి, పొగాకు, పసుపు, రొయ్యలు, మామిడి, ఇప్పుడు నిమ్మ ఇలా రైతులు ఏ పంట పండించినా వాటికి గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలం అవుతోంది. దీంతో రైతుల పంట సాగు చేసేందుకు సతమతమవుతున్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటామని చెబుతూ కాలయాపన చేస్తోంది. దీంతో దిగుబడులకు మద్దతు ధరలు లేక రైతులు డీలా పడుతున్నారు. మొన్నటికి మొన్న తోతాపురి మామిడి కాయలకు గిట్టుబాటు ధర ఇవ్వకపోవడంతో చిత్తూరు జిల్లాలో రైతులు రోడ్డుపై కాయలను పారబోసి, ప్రభుత్వం తీరుపై నిరసన వ్యక్తం చేశారు. అలాంటి స్థితి నేడు తిరుపతి జిల్లాలోని నిమ్మ రైతుల్లో నెలకొంది. నెల రోజులుగా దిగుబడులు బాగానే వస్తున్నప్పటికీ ఎగుమతులు లేకపోవడంతో ధరలు అమాంతం పడి పోయాయి. గత ఏడాది ఇదే సీజన్‌లో కిలో నిమ్మ కాయలు రూ.50 నుంచి రూ.60 వరకు పలికింది. నేడు ఆ ధర పదింతలు దిగజారి పోయి రూ.5 నుంచి రూ.25 పలుకుతోంది. దీంతో రైతులు తమ తోటల్లో కాసిన నిమ్మ కాయలను కోసి మార్కెట్‌కు తరలించలేకపోతున్నారు. అలాగే మార్కెట్ నుంచి కూడా ఢిల్లీ ప్రాంతంలోకి ఎగుమతులు నిలిచిపోయాయి.

వాతావరణంలో మార్పులు

ఎండలు విపరీతంగా ఉండాల్సిన సమయంలో అప్పుడప్పుడు వర్షాలు పడడంతో నిమ్మ చెట్టుకు బలం వచ్చింది. దీంతో పూత పూసి కాపునకు వచ్చింది. అయితే వర్షాలు పూర్తిగా నిలిచిపోయి ఎండలు ముదిరిపోవడంతో పూత రాలిపోవడం మొదలు పెట్టింది. దీనిని కాపాడుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. తీరా పూత నిలిచి కాయలు కాసే సమయానికి నాణ్యత దెబ్బతినింది. ఈ కారణంతో ఢిల్లీకి ఎగుమతులు ఇటీవల కాలంలో పూర్తిగా నిలిచిపోయింది. ఎగుమతులు లేక పోవడంతో మార్కెట్ లోని వ్యాపారులు ధరలు అమాంతం తగ్గించేస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఎగుమతులు జరిగే ప్రాంతాలివే..

నిమ్మ మార్కెట్ బాగా ఉండే సమయంలో గుజరాత్, పూణే, ముంబయి, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, సూరత్, ఢిల్లీ మార్కెట్లకు ప్రతిరోజూ కనీసం రెండు లారీలు(ఒక లారీ 22 టన్నులు) ఎగుమతులు జరిగేవి. నేడు ధరలు లేక రైతులు మార్కెట్‌కు కాయలు తీసుకుని వచ్చేందుకు కూడా ముందుకు రావడం లేదు.

కొనుగోలు చేయని సిట్రస్ పరిశ్రమలు

తిరుపతి జిల్లాలో నిమ్మరసం తీసి విక్రయించుకునే సిట్రస్ పరిశ్రమలు పెద్దగా లేవు. ఉన్న రెండు, మూడు పరిశ్రమల కూడా తగిన మద్దతు ధర ఇచ్చి కాయలు కొనుగోలు చేయక పోవడంతో రైతులకు అటు వైపు నుంచి కూడా పూర్తిస్థాయి మద్దతు లేకుండా పోతోంది. స్థానికంగా పండించే పంటకు అనువుగా ఉండే పరిశ్రమలను ప్రభుత్వం ప్రోత్సహిస్తే ఆయా పంటలు సాగు చేసే రైతులకు కొంత నష్ట నివారణ చర్యలు చేపట్టినట్లు ఉంటుంది.



ధరలు లేక కోయక రాలిపోతున్న నిమ్మ కాయలు

ధరలు లేక నరికేస్తున్న నిమ్మ చెట్లు

తిరుపతి జిల్లాలో నిమ్మ పరిశోధన స్థానం ఉన్నప్పటికీ వారు చేసే పరిశోధనలతో కొత్త వంగడాలను సృష్టించి రైతులకు అందిస్తున్నారు. ఇవి దిగుబడి బాగా ఇస్తున్నప్పటికీ వాటికి మద్దతు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలం అవుతోంది. దీంతో తిరుపతి జిల్లాలో నిమ్మ సాగు చేపట్టే గూడూరు, ఓజిలి, చిల్లకూరు మండలాలతో పాటు సమీపంలో ఉన్న నెల్లూరు జిల్లా సైదాపురం మండలంలోనూ సాగు చేపట్టిన నిమ్మ చెట్లను కొంతమంది రైతులు నరికివేసి భూములు చదును చేస్తున్నారు.

ధరలు తగ్గుముఖం పట్టాయి



నిమ్మ కాయలకు ఢిల్లీ మార్కెట్‌లో ధరలు లేకపోవడంతో ఇక్కడ కూడా ధరలు తగ్గించేస్తున్నారు. మూడు డిక్కీలు(150 కిలోలు) నిమ్మ కాయలు కోసుకుని మార్కెట్‌కు వస్తే ఖర్చు రూ.700 అయ్యింది. మార్కెట్‌లో నిమ్మ కాయలు విక్రయిస్తే రూ.1,600 వచ్చింది. ఖర్చులు పోనూ ఇక మిగిలేది ఏముంది? ఇలా అయితే నిమ్మ సాగుకు అవసరమైన పురుగు మందులు కొనుగోలు ఎలా చేయగలం.. కుటుంబాలను ఎలా పోషించుకోగలం?

– చిల్లకూరు వేమయ్య, చిల్లకూరు, తిరుపతి జిల్లా

కాయలు తోటలోనే వదిలేస్తున్నా



పది ఎకరాల్లో నిమ్మ సాగుచేస్తున్నాను. ప్రస్తుతం కాపు బాగానే ఉన్నా మార్కెట్‌లో ధరలు లేకుండా పోయాయి. దీంతో అటు గూడూరుకు గానీ, ఇటు నెల్లూరు జిల్లాలోని పొదలకూరు మార్కెట్‌కు గానీ కాయలు కోసి లోడ్ ఎత్తుకుని పోతే అక్కడ ధరలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. గత ఏడాది ఇదే సీజన్‌లో కిలో రూ.50 నుంచి రూ.60 వరకు ధర పలికింది. ఇప్పుడు కిలో రూ.5 నుంచి రూ.20 పలుకుతోంది. దీంతో ఖర్చులు కూడా రావని కాయలు తోటలోనే అలాగే వదిలేస్తున్నా.

– దామోదరరాజు, రాజుల ఎరుగుంటపాళెం, సైదాపురం మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

కానిస్టేబుల్ కొడుక్కి కానిస్టేబుళ్ల సమస్యలు పట్టవా..?

● భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: 'మానాన్న ఒక కానిస్టేబుల్.. నేను కానిస్టేబుల్ కొడుకుని.. మధ్యతరగతి కుటుంబంలో నుంచి వచ్చినవాడిని.. పేదల కష్టాలు పూర్తిగా తెలిసినవాడిని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏ పేదవాడికి, ఉద్యోగికి, మహిళకు ఏ కష్టం రానివ్వకుండా వెన్నంటి ఉండి కాపుగాస్తా'.. అంటూ పదే పదే ఊదరగొట్టిన పవన్‌కళ్యాణ్‌కు కానిస్టేబుళ్ల సమస్యలు పట్టవా? అని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ప్రశ్నించారు. తిరుపతిలో నిర్వహించిన బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారంటీ, రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో మోసాలపై బుధవారం ఆయన ఇంటింటి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ ఎండనక, వాననక, దుమ్ముధూళిని లెక్కచేయకుండా నిత్యం రోడ్లపై పహారా కాస్తూ ప్రజలకు రక్షణ కల్పిస్తున్న కానిస్టేబుళ్ల(పీసీ)లకు ఏడాదిన్నర కాలంగా టీఏ, డీఏలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. నిత్యం కానిస్టేబుల్ కొడుకునని చెప్పుకునే పవన్‌కళ్యాణ్‌కు వారి సమస్యలు చెవున పడడంలేదా? పడినా.. పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారా? అని అన్నారు. ఎన్నికలకు ముందు ఎవరికీ ఏ కష్టం రానివ్వనంటూ రోడ్లపై పడుకుని అరిచి చెప్పిన పవన్‌కళ్యాణ్ డిప్యూటీ సీఎం అయ్యాక దిష్టిబొమ్మలా మారారని విమర్శించారు. పొగాకు, మిర్చి, మామిడి రైతుల సమస్యలు పట్టించుకోరు, ప్రజల సమస్యలు పట్టించుకోరు, ఆఖరికి కానిస్టేబుల్ కొడుకుగా కానిస్టేబుళ్ల సమస్యలను పట్టించుకోకపోవడంలో నిర్లక్ష్యమేమిటో చెప్పాలన్నారు. ఇప్పటికైనా స్పందించి కానిస్టేబుళ్లకు టీఏ, డీఏలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎస్పీ కార్యాలయం వద్ద ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.



మీడియాతో మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి

సారూ..నాణ్యత చూస్తే నవ్వుతారు

నాగరికతకు చిహ్నంగా నిలిచే రహదారులు నాలుగు కాలాల పాటు నిలిచేలా నిర్మిస్తే నలుగురికి ఉపయోగం. కానీ హడావుడిగా చేసిన పనుల్లో నాణ్యత నలిగిపోగా.. నిర్లక్ష్యం తాండవిస్తోంది. రోడ్డు నిర్మాణానికి వాడిన తారు నాణ్యత లేకపోవడంతోపాటు నిబంధనల మేరకు వేయడం లేదు. దీంతో అవి ఎంతకాలం మనుగడలోకి వస్తాయన్నది ప్రశ్నార్థకంగా మారింది.

రహదారుల పనుల్లో అవినీతి

- తిరుపతి నగరంలో హడావుడిగా రహదారి పనులు
- నాణ్యతకు తిలోదకాలు.. పట్టించుకోని అధికారులు
- కాంట్రాక్టు పనులన్నీ ఆ నేతకే.. కూటమిలో మరొకరికి నో ఛాన్స్
- ఎన్నికల్లో ఖర్చు పెట్టాను.. రాబట్టుకోవాలి కదా అంటున్న ఆ నేత



తిరుపతి నగరంలో నాసిరకంగా సాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుపతి నగరంలో హడావుడిగా జరుగుతున్న రహదారి పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. నిబంధనలేవీ పాటించుకుండా ఇష్టారాజ్యంగా చేపట్టారు. రహదారి పనుల్లో నాణ్యత లేదని పలువురు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడు కరువయ్యారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రమైన తిరుపతి నగరంలో అక్కడక్కడా రహదారి పనులు చేపడుతున్నారు. రూ.కోట్ల పనులన్నీ అధికార పార్టీకి చెందిన నాయకుడే చేస్తున్నారు. కూటమి పార్టీలోని మరి కొందరు కావాలని అడిగినా.. లేదని తేల్చిచెప్పేశారని ప్రచారం జరుగుతోంది. ఎన్నికల సమయంలో పెట్టిన ఖర్చు రాబట్టుకోవాలని సమాధానం ఇచ్చినట్లు కూటమి నేతలు గుసగుసలాడుతున్నారు. తిరుపతి నగరం పరిధిలో చెర్లోపల్లి నుంచి యూనివర్సిటీ వరకు, రామానుజ కూడలి నుంచి రేణిగుంట వరకు ఆర్అండ్‌బీ ద్వారా రోడ్డు వేయించేందుకు చక్రం తిప్పారు. ఆ పనులను దక్కించుకుని తారు రోడ్డును చక చకా వేస్తున్నారు. ప్యాచ్ వర్క్‌లతో సరి పెట్టుకోవాల్సిన రోడ్డు పైన కొత్తగా రోడ్డు వేస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఈ వ్యవహారం అంతా కాంట్రాక్ట్ పనుల ద్వారా రూ.కోట్లు దక్కించుకునేందుకేనని తెలుస్తోంది. అవసరం ఉన్నా.. లేకున్నా కొన్ని పనులకు పచ్చజెండా ఊపించి, పనులను తన కన్‌స్ట్రక్షన్ కంపెనీ పేరుతో దక్కించుకుని దోచుకుంటున్నారని కూటమి నేతలు బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఆ పనులను నాసిరకంగా చేపట్టి కాంట్రాక్టు పనుల్లో ఆయన కాడికి దోచుకుంటున్నారనే విమర్శలున్నాయి. రోడ్డు నిర్మాణానికి ఉపయోగిస్తున్న తారు నాణ్యత లేదని, రోడ్డుపై వేయాల్సిన లేయర్ (మందం) ఎక్కడ అమలు కావడం లేదని అమరావతిలోని ముఖ్య నేతలకు ఫిర్యాదు చేశారు. వేయాల్సిన చోట వేయకుండా.. బాగా ఉన్న రోడ్లపై తూతూ మంత్రంగా రోడ్ వేస్తూ భారీగా డబ్బులు దండుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. సాధారణంగా టెండర్‌లో 20నుంచి 40 శాతం వరకు తక్కువ ఖర్చుతో కాంట్రాక్టర్లు పోటీపడి పనులు దక్కించుకుంటారు, అయితే కూటమి పార్టీకి చెందిన ఆ నేత మాత్రం రూ.20 కోట్ల కాంట్రాక్టు రూ.20 కోట్లకు (వందశాతం) టెండర్ ఎలా సంపాదించుకున్నారని చర్చించుకుంటున్నారు. జేసీబీలు, టిప్పర్లు, ప్రొక్లైయిన్‌లు రోడ్డు నిర్మాణానికి ఉపయోగించే ఇతరత్రా యంత్రాలు అన్ని కూడా తన సంస్థకు చెందినవేనని వీడియోలు, ఫొటోలతో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తిరుపతిలో ఎప్పుడూ కనిపించని ఆ వాహనాలు కొత్తగా దర్శనమిస్తుండడంతో కాంట్రాక్టర్లతోపాటు ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ విషయంపై వైఎస్సార్‌సీపీ నగర శాఖ తీవ్రంగా తప్పుబట్టింది.

క్లుప్తంగా

సోషల్ వెల్ఫేర్ డీడీకి చార్జ్‌మెమో

కలువాయి(సైదాపురం): జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మీటింగ్‌లో సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణికి చార్జ్‌మెమో దాఖలు చేయాలని అధికారులను నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. నెల్లూరు కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు మురళీ కృష్ణయాదవ్, శ్రీరాములు మాట్లాడుతూ ఇటీవల కలువాయి ఎస్సీ బాలుర, బాలికల హాస్టల్లో తనిఖీ నిర్వహించిన డీడీ శోభారాణి అక్కడ ఎస్సీ, బాలుర హాస్టల్‌లో వార్డెన్, ట్యూటర్లు లేకపోయినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని, అజెండా లేకుండా సమావేశాన్ని నిర్వహించడంపై వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సోషల్ వెల్ఫేర్ డీడీకి చార్జ్ మెమో ఇవ్వాలని ఆదేశించారు.

192 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

కలువాయి(సైదాపురం): మండలంలోని తోపుగుంట, చేజెర్ల మండలం కాకివాయ మధ్యలో ఏపీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం తెల్లవారు జామున కలువాయి బీట్ పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు వ్యక్తులను ఒక కారును అదుపులోకి తీసుకొన్నారు. కారులో తనిఖీలు చేయగా 192 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుందని టాస్క్‌ఫోర్స్ అధికారుల అంచనా వేశారు. ఈ వ్యవహారంపై స్థానిక అటవీశాఖ అధికారులు మీడియాకు సమాచారం ఇవ్వకపోవడం అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఘాట్‌రోడ్డులో ప్రమాదం


ఘాట్‌రోడ్డులో చెట్టును ఢీ కొన్న కారు

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో బుధవారం ప్రమాదం చోటుచేసుకుంది. తిరుమల శ్రీవారి దర్శనం ముగించుకుని బెంగళూరుకు చెందిన భక్తులు కారులో అధికవేగంగా వెళుతుండగా వినాయక స్వామి ఆలయం వద్ద కారు అదుపుతప్పి చెట్టు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం ధ్వంసం కాగా.. అందులో ఉన్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే విషయం తెలుసుకున్న ఘాట్ రోడ్డు సిబ్బంది వారిని తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించారు.

తమ కుటుంబ పోషణకు..సంస్థ పురోభివృద్ధికి కార్మికులు నిరంతరం పని చేస్తూ, స్వేదం చిందిస్తున్నారు. అయితే వారికి కష్టం వచ్చినా.. నష్టం వచ్చినా.. అనారోగ్యం బారిన పడినా.. ప్రాణం పోయినా పట్టించుకునే వారు కరువయ్యారు. వారి కుటుంబానికి అండగా నిలిచే వారు లేకుండా పోయారు. కార్మికులకు చేయూతనిచ్చే చట్టాలు అమలుకు నోచుకోకుండా పోయాయి. ఫలితంగా వారికి భరోసా.. భద్రత ప్రశ్నార్థకంగా మారింది.


స్టీల్ పరిశ్రమ నుంచి విడుదలవుతున్న పొగ

భరోసా.. భద్రత ప్రశ్నార్థకం!

- నైపుణ్యం లేని కార్మికులతో భారీ యంత్రాల వద్ద పనులు
- రియాక్టర్లు, బాయిలర్ల వద్ద తరచూ ప్రమాదాలు
- అమలు కానీ కార్మిక చట్టాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



జనవరిలో స్టీల్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వలస కార్మికులు(ఫైల్)

పెళ్లకూరు : పొట్టకూటి కోసం రాష్ట్రాలను దాటి వలస వచ్చిన కార్మికులు పలు పరిశ్రమల్లో ప్రమాదకరమైన యంత్రాల వద్ద పనులు చేస్తూ ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. అధికారులు, పాలకులు మాత్రం తమకు పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని పెన్నేపల్లి, శిరసనంబేడు గ్రామాల్లో పలు స్టీల్ పరిశ్రమలున్నాయి. ఆయా పరిశ్రమల్లో ఎక్కువ మంది పొరుగు రాష్ట్రాల కార్మికులతో భారీ యంత్రాల వద్ద పనులు చేయిస్తున్నారు. పెన్నేపల్లిలో ఉన్న ఎంఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో జనవరి ఒకటో తేదీన జరిగిన భారీ విస్ఫోటనంలో ముగ్గురు వలస కార్మికులు మృత్యువాత పడగా మరో నలుగురికి గాయాలయ్యాయి. జూన్ 26న జరిగిన మరో ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. యాజమాన్యాల నిర్లక్ష్యంతోనే పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినట్లు తెలుస్తోంది. పారిశ్రామిక అభివృద్ధి మాటున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంపెనీ యాజమాన్యానికి కల్పిస్తున్న అవకాశాలు, ప్రమాదాలు పెరగడానికి ఒక కారణంగా మారింది. మండలంలోని స్టీల్ పరిశ్రమల్లో ఎక్కువ మంది వలస కార్మికులే ప్రమాదకరమైన, భారీ యంత్రాల వద్ద పనులు చేస్తున్నారు. వాటి వద్ద పని చేసే వలస కార్మికులకు కనీస అవగాహన, నైపుణ్యం లేకపోవడం కూడా ఒక కారణంగా తెలుస్తోంది. నిరంతరం నడుస్తున్న భారీ యంత్రాలు అధిక రాపిడికి గురై విస్ఫోటనం చెందే పరిస్థితిని ముందుగానే పసిగట్టే టెక్నాలజీ లేకపోవడంతో ఇక్కడ కార్మికులు ప్రమాదాల బారిన పడడానికి మరో కారణంగా తెలుస్తోంది.

ప్రాణాలు పోతున్నా పట్టించుకొనేవారు లేరు

వలస వచ్చిన కార్మికులు ప్రమాదకరమైన యంత్రాల వద్ద పనులు చేస్తూ ప్రాణాలు కోల్పోతున్నా స్థానికంగా పట్టించుకునేవారు కరువయ్యారు. పరిశ్రమల్లో జరుగుతున్న అనేక ప్రమాదాల్లో సమాచారం బయటకు పొక్కకుండా దాచేసే ఘటనలు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ క్రమంలోనే పరిశ్రమను తనిఖీ చేసేందుకు వచ్చే అధికారులతో లోపాయికారి ఒప్పందాలు, రహస్య మంతనాలు చేసుకుంటూ మీడియా ప్రతినిధులను పరిశ్రమ గేటు దాటనీయకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపయడం విశేషం. జనవరి ఒకటో తేదీన భారీ విస్ఫోటనం జరిగిన పెన్నేపల్లి స్టీల్ పరిశ్రమ వద్దకు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు చేరుకుని పరిశీలించారు. అయితే కంపెనీ యాజమాన్యంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విశేషం. ఈ నేపథ్యంలో జూన్ మాసంలో మరో ప్రమాదం జరిగి మరొకరు మృత్యువాత పడ్డారు. పరిశ్రమల్లో కార్మికుల భద్రతా ప్రమాణాలు ఎవరికీ పట్టడం లేదు. కార్మికుల భద్రతకు సంబంధించిన ఏర్పాట్లు, ముందు జాగ్రత్త చర్యలు పరిశ్రమ శాఖలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ విభాగం అధికారులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. పరిశ్రమలను క్రమం తప్పకుండా తనిఖీలు చేస్తూ, ప్రమాదాల జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కార్మిక చట్టాలను ఉల్లంఘించే కంపెనీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు యాజమాన్యంతో కుమ్మక్కై మామూళ్లకు అలవాటు పడినట్లు తెలుస్తుంది. కార్మిక చట్టాల ఉల్లంఘనపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.1,00,600
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.9,100
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,14,300
రిటైల్ వెండి గ్రాము	రూ.117.30

ఖతార్‌లో ఉద్యోగాలు

- ఈ నెల 31 వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం

తిరుపతి అర్బన్ : ఖతార్ దేశంలో వెల్డర్ ఉద్యోగాల కోసం అర్హులైన వారు ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 24–45 ఏళ్లలోపు ఉండి, ఐటీఐ లేదా ఐటీసీ విద్యార్హతతోపాటు 4 ఏళ్ల అనుభవం ఉన్నవారు అర్హులన్నారు. టీఐజీ లేదా ఏఆర్‌సీ మల్టీ వెల్డర్ ఉద్యోగానికి ఎంపికైన వారికి రూ.52 వేల నుంచి రూ.61,500, టీఐజీ లేదా ఏఆర్సీ వెల్డర్ ఉద్యోగానికి రూ.42,500 నుంచి రూ.52 వేల వరకు వేతనాలు ఉంటాయన్నారు. కాంట్రాక్టర్ కాలపరిమితి రెండేళ్లు ఉంటుందని చెప్పారు. ఉచిత వసతి, భోజనం, వైద్య సదుపాయాలు, రవాణా సౌకర్యం, స్వదేశానికి ఒకసారి వచ్చి పోవడానికి టికెట్ సౌకర్యం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు పాస్‌పోర్ట్, అనుభవం, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను రిజిస్ట్రేషన్ సమయంలో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. వివరాల కోసం 95502 15161,91609 12690, 9988853335 ను సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు ఐఐటీలో కామన్ ఇంకుబేషన్ సెంటర్ ప్రారంభం


తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో ప్రారంభం కానున్న కామన్ ఇంకుబేషన్ సెంటర్

ఏర్పేడు: మండల కేంద్రంలోని తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో గురువారం రూ.3 కోట్ల వ్యయంతో ఏర్పాటైన కామన్ ఇంకుబేషన్ సెంటర్‌ను కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్, రాష్ట్రమంత్రి టీజీ భరత్ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నట్లు ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కెఎన్ సత్యనారాయణ తెలిపారు. తొలుత వీరు పర్యటన ఖరారైనప్పటికీ అనివార్య కారణాలతో ఢిల్లీ నుంచే కేంద్రమంత్రి వర్చువల్ విధానంలో ఈ యూనిట్‌ను ప్రారంభించనున్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రిత్వ శాఖ, ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద దేశవ్యాప్తంగా రూ.2,059 కోట్ల వ్యయంతో 76 కేంద్రాల్లో ఈ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగానే తిరుపతిలో ఈ యూనిట్‌ను ఐఐటీ ప్రాంగణంలో ప్రారంభించనున్నారు. ఇక్కడ పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్ ద్వారా రోజుకు 20 టన్నుల మేరకు మామిడి, టమాట, అంజీర్, జామ తదితర పండ్లను ప్రాసెసింగ్ చేసి జ్యూస్, జామ్, పికిల్స్ వంటి ఉత్పత్తులు స్వస్త బ్రాండ్‌తో మార్కెట్‌లోకి అందుబాటులోకి తీసుకురానున్నారు.

వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో జారిపడిన భక్తుడు

తిరుమల : శ్రీవారి సర్వదర్శనానికి వెళుతున్న మానసిక స్థితి సరిగా లేని ఓ భక్తుడు బుధవారం తెల్లవారుజామున వైకుంఠం క్యూకాంప్లెక్స్ –1లో గేటు ఎక్కి దూకే క్రమంలో జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. తిరుమల వన్ టౌన్ ఏఎస్ఐ మోహన్ నాయుడు కథనం మేరకు.. ఒడిశా రాష్ట్రం బడాంపూర్‌కు చెందిన ఎల్లయ్య రెడ్డి(50) నలుగురు స్నేహితులతో కలిసి ఈనెల 15వ తేదీ తిరుమలకు చేరుకుని, సుదర్శన్‌లో గదిని పొందిన అనంతరం సర్వదర్శనానికి బయలుదేరారు. ఈ క్రమంలో వైకుంఠం క్యూకాంప్లెక్స్–1 సమీపంలో క్యూలో స్నేహితుల నుంచి విడిపోయిన ఎల్లయ్యరెడ్డి వారి వద్దకు చేరుకునే క్రమంలో వైకుంఠం క్యూకాంప్లెక్స్ రెండో అంతస్తుకు చేరుకునే క్రమంలో గేటు ఎక్కి దూకడానికి ప్రయత్నించి, జారి కిందపడ్డారు. అర్ధరాత్రి సమయంలో ఈ సంఘటన చోటుచేసుకోగా ఎవరూ గుర్తించలేదు. బుధవారం ఉదయం గుర్తించిన తితిదే భద్రతా సిబ్బంది, పోలీసుల ద్వారా తీవ్రంగా గాయపడిన అతడిని తిరుపతిలోని స్విమ్స్ అస్పత్రికి తరలించారు. ప్రమాదంలో అతని చేతులు, కాళ్లు విరిగిపోయి, తలకు తీవ్ర గాయమైంది. ప్రస్తుతం ఆస్పత్రిలోని ఐసీయూలో చికిత్స పొందుతున్న ఇతని పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అయితే అతడితోపాటు వచ్చిన స్నేహితులను పోలీసులు విచారించగా అతడు మానసికంగా కొంత ఇబ్బందిపడుతున్నాడని ఈ క్రమంలో ఆందోళనకు గురై ఇటువంటి చర్యలకు పాల్పడినట్లు వారు పేర్కొన్నారు. దీనిపై తిరుమల పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

పంటలపై గజ దాడులు


ఏనుగుల గుంపు దాడుల్లో ధ్వంసమైన ఫెన్సింగ్

చంద్రగిరి: మండలంలోని చిన్నరామాపురం, భీమవరం గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలపై మంగళవారం అర్ధరాత్రి సమయంలో సుమారు 7 ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడి చేశాయి. వరి పంటను తొక్కివేశాయి. ఫెన్సింగ్‌ను ధ్వంసం చేశాయి. పశువులకు రైతులు వేసిన పశుగ్రాసాన్ని కూడా తొక్కేయడంతో రైతులకు తీవ్ర నష్టం వాట్టిల్లింది.

అధైర్యపడకండి.. అక్రమ కేసులను ఎదుర్కొందాం

- భాస్కర్ నా సొంత మనిషి
- చెవిరెడ్డి బిడ్డలకు జగనన్న భరోసా


తాడేపల్లిలో వైఎస్.జగన్‌ను కలిసిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

తిరుపతి రూరల్: 'అక్రమ కేసులు పెట్టారు, జైలుకు పంపారని అధైర్య పడకండి.. ఎన్ని కేసులు పెట్టినా ఎదుర్కొందాం.. మీకు అండగా నేను న్నాను, భాస్కర్ నా సొంత మనిషి, ఈ దొంగ కేసులు ఏమీ చేయలేవు.' అంటూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చెవిరెడ్డి కుమారులకు భరోసా ఇచ్చారు. విజయవాడలోని తాడేపల్లి నివాసంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిలు బుధవారం జగనన్నను కలిశారు. ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం, అదే కేసులో చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని నిందితునిగా చేర్చడం వంటి అంశాలపై వైఎస్.జగన్‌మోహన్ రెడ్డితో చర్చించారు. దీనిపై స్పందించిన జగనన్న మాట్లాడుతూ ధైర్యంగా ఉండండి, మనం న్యాయపరంగా పోరాడుదాం.. దేవుడు మనకు మంచే చేస్తాడు, మీకు నేను అండగా నిలబడతానని మనోధైర్యం కల్పించారు. జగనన్న మాటకు స్పందించిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిలు మీరే మా ధైర్యం, మీ మాటే మాకు బలం, మీ పోరాటమే మాకు స్ఫూర్తి జగనన్న..అంటూ బదులివ్వడంతో జగనన్న వారి భుజం తట్టి చిరునవ్వులు చిందించారు.

19న పీ4 సర్వేపై సీఎం ముఖాముఖి


అధికారులు, మార్గదర్శకులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి రూరల్: సీఎం చంద్రబాబు ఈ నెల 19వ తేదీన తిరుపతిలో పీ4 సర్వేపై ముఖాముఖి నిర్వహించనున్నారు. ఇదే అంశంపై జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం తన చాంబర్‌లో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు ఆర్థిక సాధికారత చేకూర్చడం, జీవన ప్రమాణంలో అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం మంది పేదల(బంగారు కుటుంబాలు)ను గుర్తించి ఆర్థికంగా వృద్ధి చెందిన (మార్గదర్శకులు) వారి ద్వారా సాయం చేయించడమే పీ4 సర్వే విధానమన్న విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు. ఇప్పటికే పీ4 సర్వే చాలా వరకు పూర్తయినందున పది శాతం మార్గదర్శకులు, 20 శాతం బంగారు కుటుంబాల వివరాలను అందుబాటులో పెట్టుకోవాలన్నారు. పీ4 సర్వేలో గుర్తించిన బంగారు కుటుంబాలు, మార్గదర్శకులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖాముఖి నిర్వహించే అవకాశం ఉన్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షీ, డీపీఓ సుశీలాదేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య మార్గదర్శకుల స్థానంలో వచ్చిన తాజ్ హోటల్, రాస్, అమరరాజా, రోటరీ క్లబ్, పాయ్ వైస్రాయ్ హోటల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు


విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న మురళీమోహన్

తిరుపతి మంగళం : లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని తిరుపతి జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు. తిరుపతి–కరకంబాడి మార్గంలో బుధవారం రవాణాశాఖ అధికారులు ద్విచక్ర వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు కోరిన బైక్‌లు కొనుగోలు చేయడంలో ఉన్న శ్రద్ధ వారికి లైసెన్స్‌లు తీసి ఇవ్వడంలోనూ, రోడ్లపై ఎంత స్పీడు వెళుతున్నాడో, ఎంతమందిని ఎక్కించుకుని బైక్ నడుపుతున్నాడన్న అంశాలపై కూడా చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అయితే ద్విచక్రవాహన తనిఖీల్లో లైసెన్స్‌లు లేకుండా, త్రిబుల్‌రైడ్ చేస్తూ, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపిన వారిలో ఎక్కువ మంది ఇంజినీరింగ్ విద్యార్థులు ఉండడం గమనార్హమన్నారు. విద్యార్థులు మొదటి సారి ఇలా పట్టుబడితే జరిమానా రసీదుతో అపరాధ రుసుము వసూలు చేస్తామని, రెండోసారి వాహన నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే న్యాయస్థానం ముందు హాజరుపరచాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం 40 ద్విచక్ర వాహనాలపై కేసులు నమోదు చేసి, వాహనచోదకుల నుంచి రూ.50 వేలు జరిమానా రూపంలో వసూలు చేశామని తెలిపారు. ఈ తనిఖీల్లో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, అధికానాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొడుకు చెప్పాడంటూ భూ కబ్జా

- కబ్జాదారులపై చర్యలు తీసుకొని న్యాయం చేయండి
- నారాయణవనం మండల బాధితులు వేడుకోలు


దౌర్జన్యంగా జేసీబీలతో భూమిని చదును చేస్తున్న ఫొటోలు చూపుతున్న బాధితులు

తిరుపతి కల్చరల్: ఎమ్మెల్యే ఆదిమూలం కొడుకు సుమన్ చెప్పాడంటూ కొందరు తమ భూమిని కబ్జా చేయడమేకాక ప్రశ్నించిన తమపై దౌర్జన్యానికి దిగుతున్నారని, వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని నారాయణవనం మండలం, ఎరుకంబట్టు గ్రామానికి చెందిన బాధితులు పన్నీరు సెల్వం, వెంకటేషన్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నారాయణవనం మండలం, ఎరుకంబట్టు గ్రామ రెవెన్యూ లెక్కదాఖలా సర్వేనంబర్ 86/1లో 77 సెంట్లు, 88/2(86/2సి)లో ఎకరా 92సెంట్లు, 86/3లో 14 సెంట్లు మొత్తం 2.83 సెంట్లు భూమి తమ తాత చంద్రప్ప కృష్ణప్ప మొదలి పేరిట ఉందని, ఈ భూమి వారి వారసులమైన తాము ఐదుగురం అనుభవిస్తున్నామని తెలిపారు. సదరు భూమిని తాము భాగపరిష్కారం కోసం తిరుపతి 3వ అదనపు జిల్లా కోర్టులో ఫిర్యాదు చేయడంతో కేసు నడుస్తోందన్నారు. అయితే ఈనెల 10వ తేదీన ఎమ్మెల్యే ఆదిమూలం కుమారుడు సుమన్ చెప్పారంటూ మాజీ ఎంపీపీ గోవిందస్వామి, ఆయన కుమారుడు ముఖేష్ మరి కొందరు జేసీబీతో తమ భూమిలోకి ప్రవేశించి చెట్లు తొలగించి వ్యవసాయ బావిని కూడా పూడ్చి దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న తాము భూమి దగ్గరకు వెళ్లి వారిని అడ్డుకుని ప్రశ్నిస్తే వారు తమపై దౌర్జన్యం చేయడమేకాక భూమిలోకి వస్తే చంపేస్తామని బెదిరించారని ఆరోపించారు. భూమికి సంబంధించిన పక్కా రికార్డులు తమ వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. అయితే రాజకీయ పలుకుబడితో తమపై దౌర్జన్యానికి దిగుతూ తమ భూమిని కబ్జా చేసేందుకు ప్రత్నిస్తున్నారని వాపోయారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారిని పిలిచి భూమి పత్రాలు అడిగితే ఇప్పటి వరకు వారికి చూపలేదని తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి రాజకీయ పలుకుబడితో తమ భూమిని దౌర్జన్యంగా కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వారితో పాటు వారి కుటుంబ సభ్యులు సి.రమేష్, సీపీ.దొరైరాజ్ పాల్గొన్నారు.

రైల్వే తత్కాల్ టికెట్ నిబంధనలు మార్పు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: రైల్వేశాఖ తత్కాల్ టికెట్ బుకింగ్ నిబంధనలు మార్పు చేసింది. సోమవారం నుంచే టికెట్ బుకింగ్స్ నిబంధనల్లో మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, యాప్‌లో తత్కాల్ టికెట్లను బుక్ చేసుకునే సమయంలో ఆధార్ అథెంటికేషన్ తప్పనిసరి అని రైల్వే అధికార యంత్రాంగం పేర్కొంది. తత్కాల్ టికెట్లు బుక్ చేసుకునే సమయంలో ఆధార్ ఓటీపీని నమోదు చేయాల్సి ఉంటుంది. రైల్వేశాఖ టికెట్ బుకింగ్‌లో పారదర్శకతను తీసుకువచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. తత్కాల్ టికెట్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభమైన వెంటనే దాదాపు అన్ని టికెట్ల నిమిషాల్లోనే బుక్ అవుతుంటాయి. ఈ నేపథ్యంలో తత్కాల్ టికెట్ బుకింగ్ సమయంలో జరిగే మోసాలను ఆపేందుకు రైల్వేశాఖ కొత్త రూల్‌ని ప్రవేశపెట్టింది.

దళారీ వ్యవస్థకు చెక్

కొందరు దళారులు, ఏజెంట్లు టికెట్లన్నింటినీ సాఫ్ట్‌వేర్, తప్పుడు మార్గాల్లో బుక్ చేస్తుండడంతో మిగిలిన ప్రయాణికులకు టికెట్లు దొరక్క ఇబ్బందులుపడుతున్న విషయాన్ని రైల్వేశాఖ గుర్తించింది. ప్రయాణికులు మాత్రమే టికెట్‌ను బుక్ చేసుకునే అవకాశం కల్పించింది. ప్రయాణానికి టికెట్లు బుక్ చేసుకునేవారు ఏసీ క్లాస్ తత్కాల్ బుకింగ్ సమయం ఉదయం 10 గంటలు కాగా నాన్ ఏసీ ప్రయాణానికి 11 గంటలు సమయం కేటాయించారు. కొత్త నిబంధనల ప్రకారం ఏజెంట్లు ఏసీ–నాన్ ఏసీ టికెట్లను తత్కాల్ టికెట్ బుకింగ్ మొదలైన అరగంట తర్వాత మాత్రమే బుక్ చేసేందుకు అవకాశం ఉంటుంది. అంటే ఏజెంట్లు ఇకపై ఏసీ టికెట్లను 10.30 గంటలకు, నాన్ ఏసీ టికెట్లు 11.30 గంటలకు బుకింగ్స్ ఓపెన్ అవుతాయి. అదే సమయంలో ప్రయాణికులు రైల్వే స్టేషన్ కౌంటర్ నుంచి తత్కాల్ టికెట్లు బుక్ చేసుకున్నా ఆధార్ నంబర్ ఇవ్వాల్సి ఉంటుంది. కౌంటర్‌లోనూ ఆధార్ ధ్రువీకరణ జరుగుతుంది. ఈ సమయంలో ప్రయాణికుడి మొబైల్ నంబర్‌ను ఆధార్‌తో లింక్ చేయాలి. తద్వారా ఓటీపీ వస్తుంది. మీరు వేరొకరికి టికెట్ బుక్ చేయాలనుకుంటే ఆ ప్రయాణికుడి ఆధార్ నంబర్‌తో పాటు ఓటీపీని నమోదు చేయాల్సి ఉంటుంది.

హెల్ప్‌లైన్ సేవలు

ఎవరికైనా ఆధార్ కార్డ్ ఉండి, టికెట్ బుకింగ్ సమయంలో ఓటీపీ రాకపోతే ఆ నంబర్ ఆధార్‌తో లింక్ చేయకపోతే ఐఆర్‌సీటీసీ హెల్ప్‌లైన్ (139)కి కాల్ చేయవచ్చు. దీంతో పాటు ఆధార్ నమోదుకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఆధార్ హెల్ప్‌లైన్ (1947) ని సంప్రదించవచ్చు. ప్రయాణికుడికి ఆధార్ కార్డు లేకపోతే, తత్కాల్ టికెట్ బుక్ చేసుకోవడం కష్టంగా మారనుంది.